ఆహారం... ఆరోగ్యం

- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'తో మేలు
- బాలింతలు, గర్భిణుల సంక్షేమానికి పెద్దపీట

అమలాపురం రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అందుకే ఆరోగ్యకర సమాజానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా మాతా శిశు మరణాల నివారణ, తల్లుల పోషణకు ప్రాధాన్యం ఇస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణకు చర్యలు తీసుకుంటోంది. రక్తహీనత, ఎదుగుదలలో లోపాల నివారణ, ఆరోగ్యవంతమైన భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం తన భుజస్కంధాలపై వేసుకుంది. దీనికి గాను వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలంలో 351 మంది గర్భిణులు, 412 మంది బాలింతలు ఉన్నారు. అలాగే అమలాపురం రూరల్‌లో 546 మంది గర్భిణులు, 637 మంది బాలింతలు, ఉప్పలగుప్తం మండలంలో 290 మంది గర్భిణులు, 345 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోమ్ న్యూట్రిషన్ ద్వారా ఇంటికే పౌష్టికాహారం అందిస్తున్నారు.


కామనగరువులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలు

అందించే సరకులివి..

టేక్ హోమ్ న్యూట్రిషన్ ద్వారా నెలకు గర్భిణీ, బాలింతకు రూ.850 విలువైన ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, మూడు కిలోల బియ్యం, అర కిలో ఆయిల్, కిలో కందిపప్పు, రెండు కిలోల రాగి పిండి, ఒక కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశెనగ చిక్కీ, పావు కిలో ఎండి ఖర్జూరం అందిస్తున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న వైఎస్సార్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాల సంజీవనికి అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇవి అర్హులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పోషకాహారం విధిగా తీసుకోవాలి



తల్లీ, బిడ్డ సంపూర్ణ సంరక్షణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తోంది. దీని ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు విధిగా తీసుకోవాలి. తద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చు. గర్భిణీగా నమోదైన నాటి నుంచి ఆరో నెల బాలింత వరకూ ఇంటి వద్దకే సరకులు అందజేస్తున్నాం.

– కేఎల్‌డీ కుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ, అమలాపురం

ఎంతో మేలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుంది. దీని ద్వారా ఇచ్చే సరకులు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి. బాలింతలు, గర్భిణులకు అవసరమైన పది రకాల సరకులు అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం సంతోషదాయకం.

– కృష్ణవేణి, బోడసకుర్రు

ఇంటికే సరకుల అందజేత



పోషకాహార లోపంతో ఎన్నో సమస్యలు వస్తాయి. సరైన ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా కిట్లను అంగన్‌వాడీ సిబ్బంది ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు. ఈ కిట్లు బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతున్నాయి.

– కె.ఉమాకాత్యాయని, అమలాపురం

క్లుప్తంగా

సమస్య పరిష్కారానికి చర్యలు


పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో సీసీ రహదారికి బెర్ములు వేసేందుకు తెచ్చిన గ్రావెల్

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుంది. తోటపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఈ నెల 23న పర్యటించారు. ఆ గ్రామంలో రహదారి నిర్మించి బెర్ములు వేయకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు, దళిత నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పొన్నాడ సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పని పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ గురువారం ఆయా పనులను ప్రారంభించారు. వెంటనే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే పొన్నాడకు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది పెయ్యల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం


మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థమహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారి పెద్ద జాతరను గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. తీర్థమహోత్సవం సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. మహాలక్ష్మి అమ్మవారిని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవింద కుమార్, నాయకులు అంకాడి అంజిబాబు, కొపనాతి నాగరాజు, రేకాడి నరసింహమూర్తి, పోతాబత్తుల నూకరాజు, అరదాడి అన్నవరం, కర్రి ఆదినారాయణ ఉన్నారు.

బాణసంచా విక్రయాలకు దరఖాస్తులు

యానాం: వచ్చే దీపావళి పండగను పురస్కరించుకుని యానాంలో బాణసంచా అమ్మకాలు నిర్వహించుకునే వారు తాత్కాలిక లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని గురువారం పుదుచ్చేరి డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల 8లోగా యానాం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు.

ఉత్సాహంగా 5కే రన్


5కే రన్‌లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు

యానాం: పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాలయోగి క్రీడా మైదానంలో 5కే రన్ ఉత్సాహంగా జరిగింది. ఈ పరుగు పందెంను రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సిబ్బందిని అభినందించారు. జీజీహెచ్ డీడీ రవిశంకర్, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అమలాపురం టీపీవోకు పదోన్నతి

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో)గా పనిచేస్తున్న ఎం.తిరుపతిరావుకు ఉద్యోగోన్నతి లభించింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా పదోన్నతి పొందడంతో ఆయనను ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇక్కడ ఇంకా ఎవరినీ నియమించలేదు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి ఎం.వీరభద్రరావు, మంగతాయారు (అమలాపురం మండలం ఈదరపల్లి) రూ.25 వేలు, వి.రామకృష్ణ, సత్యవతి దంపతులు (తాళ్లరేవు) రూ.10,001 చొప్పున గురువారం విరాళాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఈ విషయం తెలిపారు.

జి.వేమవరం పాఠశాలకు అవార్డు



జి.వేమవరం హైస్కూల్‌లో క్రీడా పోటీల విజేతలు

తాళ్లరేవు: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అందించే స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ అవార్డ్ ఇన్ స్పోర్ట్స్‌లో జి.వేమవరం ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో 92 పాయింట్లు సాధించింది. అంతేకాకుండా కాకినాడ జిల్లా స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించిందని గురువారం హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. గత ఏడాది రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్, హ్యాండ్‌బాల్, త్రోబాల్, బేస్‌బాల్ తదితర క్రీడల్లో 20 మంది బాలురు, బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా పీఈటీలను, క్రీడాకారులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు తదితరులు అభినందించారు.

బకాయి వేతనాలు ఇవ్వాలి

తాళ్లరేవు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఆయా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చింతా మోహన్‌కృష్ణకు అందజేశారు. అనంతరం ఏపీఓ అన్నపూర్ణతో కమిటీ నాయకులు చర్చించారు. సంఘ నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకురాజు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలతో మహిళలకు జీవనోపాధి

మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పలు స్టాల్స్ ఏర్పాటు చేసి మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతతో పలు డ్వాక్రా సంఘాలు స్వయంగా ఇళ్ల వద్దే తయారు చేసిన పలు ఉత్పత్తులను ఈ మార్కెట్‌లో విక్రయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న రుణాలు వారి జీవనోపాధికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. మెప్మా సిటీ మేనేజర్ వి.రామలక్ష్మి మాట్లాడుతూ ఈ మార్కెట్‌లో తక్కువ ధరలకే ఉత్పత్తులను విక్రయిస్తూ కొద్దిపాటి లాభాలతో మహిళలు ఈ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. పలు రకాల తినుబండారాలు, అల్లిక వస్తువులు, పలు గృహోపయోగ వస్తువులను విక్రయించారు. ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పలు వస్తువులను కొనుగోలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, నాగారపు వెంకటేశ్వర రావు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి సత్యనారాయణ, బండారు సత్యనారాయణ, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పట్టణ సమాఖ్య ఆర్పీలు పి.శ్యామల, శైలజ, టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

నేటి నుంచి వారోత్సవాలు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 30 వరకూ తీర ప్రాంత గ్రామాల ప్రజలకు బొక్కు సొరపై అవగాహన కల్పించనున్నట్లు గురువారం అటవీ క్షేత్రాధికారి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోరంగి అభయారణ్యాన్ని ఆనుకుని ఉన్న భైరవపాలెం, సావిత్రినగర్, పెదవలసల, మట్లపాలెం, కుంభాభిషేకం, షిప్పింగ్ హార్బర్, ఉప్పాడ, కోనపాపపేట తదితర గ్రామాల్లో వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సొరను రక్షించుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

అమలాపురం రూరల్: స్థానిక డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సర్వీసును ఆధార్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ మోకా రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుల మతాలకు అతీతంగా పథకాల అమలు

అమలాపురం రూరల్: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. గురువారం పేరూరు పరిధి 12వ వార్డు అప్పారివారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరిస్తూనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరిగి పట్టం కట్టాలని కోరారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరిరామ్ గోపాల్, గెడ్డం సంపదరావు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, గ్రామ సర్పంచ్ అరుణడేవిడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ చొల్లంగి సుబ్బిరామ్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, పార్టీ జిల్లా సేవాదళ్ చైర్మన్ మంగళంపల్లి అంజిబాబు, ఎంపీటీసీ వాసంశెట్టి శ్రీను, నాయకులు సూదా గణపతి వాసంశెట్టి సత్తిరాజు పాల్గొన్నారు.


పేరూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్

మార్కెట్‌కు శ్రావణ శోభ

ముమ్మిడివరం: శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో మార్కెట్‌కు ప్రత్యేక శోభ వచ్చింది. వస్త్ర, బంగారు, పండ్ల దుకాణాలు కిటకిటలాడాయి. మహిళలు తమ ఇళ్లను శుభ్రం చేసుకుని అందాల ముగ్గులు పెట్టి, గుమ్మాలను మామిడి తోరణాలతో అలంకరించారు. ముమ్మిడివరం బంగారు మార్కెట్‌లో రద్దీ నెలకొంది. వరలక్ష్మి వ్రతం ఆచరించే మహిళలు బంగారు లక్ష్మీరూపుతో అమ్మవారిని పూజించడం ఆనవాయితీ. చిన్నరూపుతోనైనా పూజిస్తే తల్లి కరుణా కటాక్షాలు ఉంటాయని వారి ప్రగాఢ విశ్వాసం. లక్ష్మీరూపుల విక్రయాలతో బంగారు దుకాణాలు కళకళలాడాయి. ఇదిలా ఉంటే చామంతి పూలకు గిరాకీ ఏర్పడింది. అమ్మవారికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు చేస్తుండడంతో చామంతి పూల రేటు అమాంతం పెరిగింది.

యానాం: వరలక్ష్మీ వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రి కొనుగోళ్లతో గురువారం యానాంలో సందడి నెలకొంది. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన జనసందోహం మధ్య స్థానిక చిన్నాసెంటర్, విష్ణాలయం వీధి కిక్కిరిసింది. ఇక్కడ పూజా సామగ్రి, పండ్ల విక్రయాలు జోరుగా సాగాయి. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.


యానాం చిన్నా సెంటర్‌లో పండ్ల విక్రయాలు

మిత్ర పురుగులను సంరక్షించుకోవాలి


నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయ్‌కుమార్

అంబాజీపేట: మిత్ర పురుగులను సంరక్షించుకోవడం వల్ల వరి పంటకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ పి.గన్నవరం సహాయ సంచాలకుడు (ఏడీఏ) ఎస్‌జేవీ రామ్మోహనరావు అన్నారు. మండల వ్యవసాయాధికారి (ఏఓ) సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన ఇరుసుమండ గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ, ఏఓ మాట్లాడుతూ, వరి పంటకు నష్టం చేసే పురుగుల నిష్పత్తిని బట్టి పురుగు మందుల వాడకాన్ని నిర్ణయించుకోవాలన్నారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడటం వల్ల పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని చెప్పారు. నీమాస్త్రంతో గుడ్డు దశలో ఉన్న పురుగులు, లద్దె పురుగుల ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. వేప నూనె, వేప గింజల కషాయం లేదా నీమాస్త్రం వాడటం వల్ల వరిలో పురుగుల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏ ఎస్.కిరణ్‌దుర్గ, సొసైటీ డైరెక్టర్ దొమ్మేటి రాధా సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: నాడు–నేడు పథకం రెండో విడతలో అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పాఠశాల అదనపు తరగతి భవన నిర్మాణ పనులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాడు – నేడు పథకంలో రూ.1.30 లక్షలతో 8 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామన్నారు. నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థులందరూ భోజనం తినేలా చూడాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు కేవీ శశిధర్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న శేషశయన ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఆనందమానందమాయే..

ఇస్రో విజయంపై ప్రదర్శనలు

అమలాపురం టౌన్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పట్టణంలోని పలు చోట్ల ఆనందోత్సాహాలు జరుపుకొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇస్రో శాస్త్రవేత్తల కీర్తిని కొనియాడారు. తొలుత 120 మీటర్ల పొడవుగల త్రివర్ణ జెండాను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు 'ఇస్రో' ఇంగ్లిషు అక్షరాల రూపంలో కూర్చుని ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రపతి ముర్ము ద్రౌపది, ప్రధాని మోదీ, ఇస్రో చైర్మన్ సోమనాథ్, శాస్త్రవేత్తలు వేషధారణల్లో భారీ జెండా వెంట ప్రదర్శనగా సాగారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరి రామగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ డి.జయప్రకాష్, సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్‌కే అలీ, ఫిజికల్ డైరెక్టర్లు తోట రవి, జి.గోవిందరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

జయహో భారత్..

అమలాపురం రూరల్: ఇస్రో పంపిన విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ బుధవారం చంద్రుడి దక్షిణ ధ్రువంపై తన పాదాన్ని మోపింది. ఈ ఘనతను ప్రపంచమంతా కీర్తిస్తుంది. ఇంతటి విజయానికి కారణమైన శాస్త్రవేత్తలను ప్రశంసిస్తూ బండారులంకకు చెందిన అధ్యాపకుడు, వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము ఓ చిత్రాన్ని గీశారు. నాడు స్వాతంత్ర్య సమరయోధులు మాతృభూమిపై జాతీయ జెండాను రెపరెపలాడిస్తే.. నేటి ఇస్రో శాస్త్రవేత్తలు ఏకంగా చంద్రునిపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేశారంటూ సృజనాత్మకంగా గీసిన చిత్రం పలువురిని ఆకట్టుకుంటోంది.


అమలాపురంలో 120 మీటర్ల త్రివర్ణ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నాటి స్వాతంత్ర్య సమరయోధులు, నేటి ఇస్రో శాస్త్రవేత్తల కీర్తిని వివరిస్తూ రాము గీసిన చిత్రం

కాట్రేనికోన: ఇస్రో శాస్త్రవేత్తలు భారతదేశ సత్తాను ప్రపంచ దేశాలకు చాటారని జెడ్పీటీసీ నేల కిషోర్ కుమార్ అన్నారు. చంద్రయాన్–3 విజయవంతంపై బలుసుతిప్పలో అగ్నికుల క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో విజయోత్సవం జరుపుకొన్నారు. గాంధీ సెంటర్‌లో ఓలేటి సతీష్ కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. గెద్దనాపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు, చెంచులగరువు గ్రామస్తులు సంబరాలు జరుపుకొన్నారు.

అమలాపురం రూరల్: జాబిల్లిపైకి ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పాలగుమ్మి విద్యార్థులు పలు ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులు ఇస్రో ఇంగ్లిష్ అక్షరమాలగా ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు, పీఈటీ జె.లక్ష్మణ్ పాల్గొన్నారు.


ఇస్రో ఇంగ్లిష్ అక్షర రూపంలో కూర్చున్న పాలగుమ్మి పాఠశాల విద్యార్థులు

వ్యాధులపై అప్రమత్తత అవసరం


వంశీకృష్ణ కాలనీలో డ్రైన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డెంగీ కేసులు అధికంగా వస్తున్నాయని, వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి అన్నారు. గురువారం ఆయన స్థానిక వంశీకృష్ణకాలనీ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లో డ్రైన్ల శుభ్రతపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు డ్రైన్‌లలో మురుగు నీరు పారే విధంగా చూడాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రకాశం తదితరులు ఉన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉప్పలగుప్తం: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.భవాని సూచించారు. చల్లపల్లి, కూనవరం గ్రామాల్లో ఖరీఫ్ వరి క్షేత్రాలను మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరిపై ఆకుముడత, నల్లి ఆశించే అవకాశం ఉందన్నారు. ఆకుముడత నివారణకు ఎసిఫేట్ 13 గ్రాములు, వేపనూనె 5 మిల్లీ లీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి వరిపై పిచికారీ చేయాలన్నారు. నల్లి నివారణకు ప్రొఫెనోపాస్ రెండు మిల్లీ మీటరు లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొటాష్ లోపం నివారణకు 15 కిలోల పొటాష్‌ను, పది కిలోల యూరియాలో కలిపి చేనుకు అందించాలన్నారు. వీఏలు అనూష, చందు, పావని, గుణవర్ధన్ పాల్గొన్నారు.


చల్లపల్లిలో వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త భవాని, ఏఓ కుమార్‌బాబు

ప్రత్యేక ఆధార్ శిబిరం పరిశీలన


ఆధార్ శిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓలు విజయ్‌థామస్, ప్రభాకరరావు

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని డీఎల్‌డీఓ విజయ్ థామస్, కొత్తపేట డీఎల్‌డీఓ ప్రభాకరరావు గురువారం పరిశీలించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బోడసకుర్రు–1, 2 సచివాలయాలను పరిశీలించి సచివాలయ సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు పారదర్శకంగా అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, లోవరాజు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.